ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 10.09.2024 సమయం: 13.10గంటలు

ముఖ్యాంశాలు

1.దేశంలోనే అత్యంత వేగంగా ఆర్థికాభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రానికి అన్ని విధాలుగా తోడ్పాటునందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 16వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు.

2. తెలంగాణలో అకాల వర్షాలు , వరదల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడం కోసం కేంద్ర అధికారుల బృందం రేపు రాష్ట్రంలో పర్యటించనుంది.

3. ఖమ్మం జిల్లాలోని వరద ముంపు బాధిత కుటుంబాలకు ఈ రోజు నుంచి బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సాయం జమ అవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చెప్పారు.

4.తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

**CM**

దేశంలోనే అత్యంత వేగంగా ఆర్థికాభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రానికి అన్ని విధాలుగా తోడ్పాటునందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 16వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు. దేశాభివృద్ధిలో కూడా తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ రెండు రోజుల పర్యటనలో ఉన్న ఆర్థిక సంఘం ఛైర్మన్ అర్వింద్ పనగారియాతో ముఖ్యమంత్రి ఈ ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...బలమైన పునాదులు, చక్కటి ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ... ఆర్థికంగా తెలంగాణ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని వివరించారు. భారీ రుణ భారం తెలంగాణకు సవాల్ గా మారిందన్నారు. గత ఆర్థిక సంవత్సరం

చివరి నాటికి రుణ భారం 6.85 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. ఈ నేపథ్యంలోనే రుణాల సమస్యను పరిష్కరించేందుకు తగిన సహాయం, మద్దతు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు.

(pn)

BHATTI VIKRAMARKA

కాగా, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వాలని 16వ ఆర్థిక సంఘాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. రాష్ట్రానికి వచ్చే పన్నుల వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని కోరారు. కేంద్ర పథకాల అమలులో కఠినమైన నిబంధనలు ఇబ్బందిగా మారుతున్నాయని పేర్కొన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ రాష్ట్రానికి జీవరేఖ లాంటివని, ఇవి ప్రజలకు ఆర్థిక భద్రతను కల్పిస్తాయన్నారు. వాటిని ఆర్థిక సంఘం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రాయోజిత పథకాలను రూపొందించడానికి స్వయం ప్రతిపత్తిని కల్పించాలన్నారు.

(MSL)

CENTRAL TEAM VISIT

తెలంగాణలో రేపు కేంద్ర బృందం పర్యటించి అకాల వర్షాలు , వరదల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేస్తుందని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సలహాదారు, కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి కల్నల్ కీర్తి ప్రతాప్ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం ఖమ్మం , మహబూబాబాద్ జిల్లాలతో సహా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తుందన్నారు. ఈ బృందంలో ఆర్థిక , వ్యవసాయం, రోడ్లు, రహదారులు, గ్రామీణాభివృద్ధి, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ విభాగాలకు చెందిన అధికారులు కూడా ఉంటారని వివరించారు. భారీ వర్షాలు , వరదల కారణంగా ఇప్పటి వరకు 33 మంది మృతి చెందారని , 358 గ్రామాలు ముంపుకు గురయ్యాయని , ప్రాథమిక అంచనా ప్రకారం 5,438 కోట్ల నష్టం జరిగిందని ప్రభుత్వం పేర్కొంది.

(DESK)

KHAMMAM

ఖమ్మం జిల్లాలోని వరద ముంపు బాధిత కుటుంబాలకు వారి బ్యాంకు ఖాతాల్లో ఈరోజు నుంచి ఆర్థిక సాయం జమ అవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చెప్పారు. ఖమ్మం జిల్లాలో వరదల కారణంగా 339.45 కోట్ల రూపాయల మేర నష్టం సంభవించినట్టు ఇప్పటివరకు ప్రాథమిక అంచనాల్లో తేలిందన్నారు. ముంపు కారణంగా సుమారు 15 వేల 055 ఇళ్లల్లోకి వరద నీరు వచ్చి చేరిందన్నారు. వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకొనేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

(PTC)

GODAVARI- BHADRACHALAM

మరోవైపు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం 45 అడుగులకు పైగా గోదావరి ప్రవహిస్తుండగా.. ఈ సాయంత్రానికి 50 అడుగులకు పెరిగే అవకాశం ఉందని కేంద్ర జల సంఘం అధికారులు తెలిపారు. తా లి పేరు ప్రాజెక్టు నుంచి లక్ష క్యూసెక్కులకు పైగా ఇన్ ఫ్లో ఉండడంతో పాటు.. ఇంద్రావతి శబరి నదుల్లో వరద ఉధృతి ఇంకా పెరగడంతో గోదావరికి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమయింది.

(PTC)

TS POPULATION

గత పదేళ్ల కాలంలో తెలంగాణలో గ్రామీణ జనాభా తగ్గి , పట్టణ జనాభా పెరిగిందని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెలువరించిన హెల్త్ డైనమిక్స్ ఆఫ్ ఇండియా నివేదిక -2023 వెల్లడించింది. గ్రామీణ జనాభా 2011 - 23 మధ్య కాలంలో 7.84 శాతం తగ్గగా , పట్టణ జనాభా 35.05 శాతం పెరిగిందని పేర్కొంది. 2023 జూలై ఒకటి నాటికి రాష్ట్ర జనాభా 3 కోట్ల

81 లక్షల 35 వేలకు చేరుకుందని తెలిపింది. జన సాంద్రత విషయంలో దేశంలోనే తెలంగాణ 18వ స్థానంలో  ఉందని వివరించింది.

(పిఐబి)

**CM- CHAKALI ILAMMA**

 నేడు తెలంగాణ తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరనారీ చిట్యాల ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చిట్యాల ఐలమ్మ కనబరిచిన ధైర్య సాహసాలను     స్మరించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ యోధురాలికి నివాళులు అర్పించారు. ఆసిఫాబాద్ లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే పాల్గొని ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనియాడారు. జగిత్యాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సత్య ప్రసాద్ ఐలమ్మ చూపిన తెగువ తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. వివిధ జిల్లాల్లో ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.                వనపర్తిలో జరిగిన కార్యక్రమంలో  ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పాల్గొన్నారు.

(PTCS)

NALGONDA

స్వచ్ఛ వాయు సర్వేక్షణ్- 2024 పోటీల్లో దేశంలోనే నల్గొండ పురపాలిక రెండో స్థానం దక్కింది. ఈ ఘనత సాధించినందుకు   స్వచ్ఛవాయుదివాస్ సంద ర్భంగా రాజస్థాన్ జైపూర్ లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ , అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ , రాజస్థాన్ ముఖ్యమంత్రి బజానా చేతుల మీదుగా     నల్గొండ పురపాలక   చైర్మన్ బుర్రీ శ్రీనివాస్ రెడ్డి   , కమీషనర్ ముసాబ్ అహ్మద్ సయ్యద్  అవార్డుతో పాటు 25లక్షల నజరానా అందుకున్నారు.. ఈసందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... దేశంలోని 131 పట్టణాల్లో నల్లగొండ పురపాలక కి 2వ స్థానం దక్కడం గొప్ప విషయమని, పట్టణ ప్రజలు, సిబ్బంది సహకారం తోనే ఈ ఘనత సాధించామని అన్నారు.

(PTC)

**KISHANREDDY – VANDE BHARAT**

తెలంగాణ నుంచి మరో వందేభారత్ రైలు ప్రారంభం కానుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే నాలుగు వందే భారత్ రైళ్లు తెలంగాణ మీదుగా సేవలందిస్తుండగా.. ఐదో వందేభారత్ రైలు ఈనెల 15 నుంచి నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య పరుగులు పెట్టనుందని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ఈ రైలును ప్రారంభించనున్నారని చెప్పారు. దీంతో ఈ రెండు నగరాల మధ్యన ఉన్న 578 కి.మీ. ల దూరాన్ని కేవలం 7 గంటల 15 నిమిషాల్లోనే పూర్తి చేయవచ్చునని ఒక ప్రకటనలో కేంద్ర మంత్రి తెలిపారు.

(X)

**KRISHNA SHASTRI**

ఆకాశవాణి సీనియర్ అనౌన్సర్ , సంగీత స్వర కర్త ఈమని కృష్ణ శాస్త్రి ఈ తెల్లవారు జామున విజయవాడలో తుది శ్వాస విడిచారు. ఆయన వయస్సు 59 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రంలో అనౌన్సర్ గా ఉద్యోగ జీవితం ప్రారంభించిన కృష్ణ శాస్త్రి హైదరాబాద్, విశాఖ పట్టణం , విజయవాడ కేంద్రాల్లో సుమారు 30 సంవత్సరాల పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆకాశవాణిలో ఎన్నో లలిత గేయాలకు స్వరకల్పన చేశారు. ఆయన మృతి పట్ల ఆకాశవాణి అధికారులు ,సిబ్బంది తీవ్ర సంతాపం తెలియచేశారు.

(DESK)

**TS RAINS**

తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆసిఫాబాద్ , మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదిలాబాద్,

నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందపి పేర్కొంది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

(PN)

**CPI**

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల వల్ల సంభవించిన నష్టాన్ని ప్రకృతి విపత్తుగా ప్రకటించి పది వేల కోట్ల రూపాయల ఆర్ధిక సహాయం అందించాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వరద బాధితులకు సీపీఐ పక్షాన చేతనైనంత సాయం చేస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన వంతుగా ఎమ్మెల్యేగా వచ్చే ఒక నెల వేతనం రెండున్నర లక్షల మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇస్తానని తెలిపారు.

(PN)

SANGAREDDY. PTC

సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్ లో ఏర్పాటు చేసిన మార్క్ ఫెడ్ పెసర కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పి సంజీవరెడ్డి ఈ రోజు ఉదయం ప్రారంభించారు. క్వింటాలుకు 8వేల 262 రూపాయలు చెల్లించి మార్క్ ఫెడ్ కొనుగోలు చేస్తోంది.

(PTC)